సాక్షి
వికారాబాద్

గురువారం । 14 । డిసెంబర్ । 2023



సీఎంపైనే ఆశలన్నీ..

నేతలు తమ సేవలు, పదవులు చేపట్టేందుకు ముందుగా బొంరాస్‌పేట మండలాన్నే ఎంచుకోవడం ఆనవాయితీ. . 8లో▸



యువత సైన్యంలో చేరాలి

దేశం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసే జవాన్లు నిజమైన హీరోలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. 8లో▸



కారు నడిపేది ఎవరో..?

శాసన సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మెజార్టీ ఇచ్చిన మండలానికి అధ్యక్షుడు కరువయ్యాడు. 9లో▸

న్యూస్‌రీల్

సీఎం దృష్టికి మోడల్ స్కూల్ సమస్యలు



సీఎం రేవంత్‌రెడ్డితో కొండయ్య, నర్సిరెడ్డి

బంట్వారం: తెలంగాణ మోడల్ స్కూల్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీఎస్ ఎంఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండయ్య బుధవారం ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కొండయ్య పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కేసీఆర్‌ను పరామర్శించిన కొప్పుల మహేశ్‌రెడ్డి



కేసీఆర్‌ను పరామర్శిస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి: మాజీ సీఎం కేసీఆర్ నగరంలోని యశోద ఆస్పత్రిలో బుధవారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే కోలుకుని ప్రజల్లోకి వస్తారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదం కేసీఆర్‌పై ఉందని అన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



శివారెడ్డిపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న గోపాల్

దోమ: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ ఆదేశించారు. బుధవారం మండలంలోని శివారెడ్డిపల్లి, బొంపల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం తోపాటు, రైతులకు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం తేమ శాతం పరిశీలించి మద్దతు ధరకు వద్దు కొనుగోలు చేయాలన్నారు. తూకాల్లో తేడా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం నింపేందుకు గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మండల అధికారి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

17నుంచి ధనుర్మాస పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలో వెలసిన పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ మహాలక్ష్మీ వెంకటేశ్వర ఆలయంలో ఈ నెల 17వ తేదీ నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తలు, అర్చకులు తెలిపారు. 16వ తేదీ అర్ధరాత్రి ధనుస్సంక్రమణ జరుగుతుందని తెలిపారు. 17వ తేదీ వేకువజాము నుంచి ఆలయంలో ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 4గంటలకు వాయిద్యం, 5 గంటలకు సుప్రభాత సేవ, 5–30గంటలకు ఆలయ పండితులు శ్రీనివాసాచారి తిరుప్పావై పారాయణం చేస్తారని, అనంతరం ప్రవచనాలు అందించనున్నారని తెలిపారు.

సభాపతికి లైన్ క్లియర్

ప్రసాద్‌కుమార్‌కు శాసనసభ స్పీకర్ పదవి లాంఛనమే

- ఒకే నామినేషన్ దాఖలు కావడంతో పోటీ లేకుండానే ఎన్నికకు అవకాశం
- ఉమ్మడి జిల్లాకు మొదటిసారి దక్కిన గౌరవం
- రాష్ట్రంలో మొదటి దళిత స్పీకర్ కూడా ఆయనే



అసెంబ్లీ స్పీకర్‌గా నామినేషన్ వేయడానికి వచ్చిన ప్రసాద్‌కుమార్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్‌రెడ్డి, సామేలు

వికారాబాద్: అసెంబ్లీ స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఎంపిక లాంఛనమే కానుంది. బుధవారం ఆయనొక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ సైతం ఆయనకు మద్దతు తెలపడంతో ఎంపిక ఏకగ్రీవం కానుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వికారాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో మంత్రిగా పని చేసిన ఆయన రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవిని ఆశించారు. తన సామాజిక వర్గం నుంచి తీవ్ర పోటీ ఉండటంతో ఆ ఆశలు వదులుకున్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలవడం, గతంలో మంత్రిగా పని చేసిన అనుభవం ఉండటం తదితర విషయాలను పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం పెద్దలు ప్రసాద్‌కుమార్‌ను స్పీకర్ పదవికి ఎంపిక చేశారు.

అనతి కాలంలోనే..

తాండూరు వాస్తవ్యుడైన ప్రసాద్‌కుమార్ మర్పల్లి ఎంపీపీగా జిల్లాలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 2008 ఉప ఎన్నికల్లో మొదటిసారిగా వికారాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ వెంటనే 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ విజయం సాధించి మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో జౌళి శాఖ మంత్రిగా పని చేశారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మళ్లీ వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మొదటి స్పీకర్ కానుండంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో మొదటి దళిత స్పీకర్ కూడా గడ్డం ప్రసాద్‌కుమార్ కావడం విశేషం.

బంధు.. బందేనా..!

బీసీబంధు, దళితబంధుపై నీలినీడలు

- కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో పథకాల్లో మార్పు జరిగే అవకాశం
- లబ్ధిదారుల్లో ఆందోళన



లబ్ధిదారులకు బీసీబంధు చెక్కులు అందజేస్తున్న నాయకులు, అధికారులు (ఫైల్)

కుల్కచర్ల: వెనుకబడిన వర్గాల్లోని నిరుపేదలకు ఆర్థిక చేయూతనిచ్చి వారి పురోగతికి అండగా నిలవాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీ బంధు, దళిత బంధు పథకాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.. అయితే ఈ రెండు పథకాలు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రవేశపెట్టారు. కొందరికి లబ్ధి చేకూరగా.. మరికొందరి పేర్లు అర్హుల జాబితాలో ఉన్నాయి. చెక్కులు వచ్చే క్రమంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తదనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమిపాలు కావడం, కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టడంతో ఈ పథకాలు అమలవుతాయా అనే అనుమానాలు లబ్ధిదారుల్లో నెలకొన్నాయి. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ పథకాలపై పెద్ద ఎత్తున ఆరోపణలు చేసింది. ఈ క్రమంలో ఈ పథకాలను కొనసాగిస్తుందా లేదా అనే అనుమానాలు లేకపోలేదు. బీసీ బంధు, దళిత బంధు పథకాలను ఆపేసి కొత్తగా మరొక పేర్లతో వీటికి ప్రత్యామ్నాయ పథకాలను రూపొందించాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశంగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే జాబితాలో పేర్లుండి పథకం అమలవుతుందని ఆశ పెట్టుకున్న వారు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో 1,758 మంది లబ్ధిదారులు

దళితబంధు మొదటి విడతలో భాగంగా జిల్లాలోని 358 మందికి లబ్ధి చేకూరింది. బీసీ బంధు మొదటి, రెండు విడతల్లో 1,400మంది ఆర్థిక సాయం పొందారు. మరో 600మందిని అర్హులుగా గుర్తించారు. వీరికి చెక్కులు అందజేయాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రక్రియ ఆగిపోయింది. ఎన్నికలు పూర్తయ్యాక చెక్కులు అందుతాయని లబ్ధిదారులు భావించారు. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టింది. ఈ క్రమంలో పథకం అమలవుతుందా లేక ఆపేస్తారా అనే అనుమానం లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది.

ఎలాంటి ఆదేశాలు అందలేదు



బీసీబంధు కొనసాగింపుపై ప్రస్తుతం మాకు ఎలాంటి ఆదేశాలు లేవు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అనుసారం బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర అధికార యంత్రాంగం సూచనలకు అనుగుణంగా తదుపరి విధివిధానాలను తెలియజేస్తాం.

– ఉపేందర్, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి

పైరవీలు చేసిన నేతలకు..

గతంలో బీసీబంధు, దళితబంధు పథకాలను పొందేందుకు కొందరు ఆశావహులు స్థానిక నేతలు, వివిధ మార్గాల ద్వారా ప్రయత్నించారు. కొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నేతలే ముడుపులు తీసుకొని దరఖాస్తుదారులకు పథకంలో వారి పేర్లు వచ్చేలా చేశారన్న ఆరోపణలు వినిపించాయి. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు ఈ పథకాల కొనసాగింపుపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొందరు అప్పులు చేసి పథకాలు పొందేందుకు ప్రయత్నించారన్న ప్రచార నేపథ్యంలో ప్రస్తుతం వారి పరిస్థితి ఏమిటనేది ఆసక్తి కలిగిస్తోంది. ముడుపులు తీసుకున్న నేతలు చెప్పే కథలు వింటారా? వదిలేస్తారా లేదా అది చూడాలి.



నిధుల మంజూరు పత్రాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే టీఆర్‌ఆర్, మైనార్టీ నాయకులు

ఇస్తేమా నిర్వహణకు నిధులు

పరిగి: పట్టణంలో జనవరి నెలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇస్తేమా కార్యక్రమానికి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇస్తేమాకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరడంతో ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ ఉమర్ జలీల్ రూ. 2కోట్ల 45లక్షలు విడుదల చేశారని, ఇందుకు సంబంధించిన పత్రాలను తమకు అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని మతాలకు సముచిత స్థానం కల్పిస్తుందని పేర్కొన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఇస్తేమాకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి, దేశంలోని పలు రాష్ట్రాల ముస్లింలు ఇక్కడికి వస్తారని తెలిపారు. వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. మైనార్టీలకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాషా మిహిమొద్దీన్, రఫీ, అంజాద్ తదితరులు పాల్గొన్నారు.

19న కొబ్బరికాయల విక్రయానికి వేలం

అనంతగిరి: అనంతగిరి గుట్ట అనంత పద్మనాభ స్వామి ఆలయంలో కొబ్బెరి కాయలు విక్రయం, పార్కింగ్ ఫీజు వసూలు కోసం ఈనెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నరేందర్, ధర్మకర్త పద్మనాభం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటి నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు (కార్తీక మాసం మినహాయించి) కొబ్బరి కాయలు, పార్కింగ్ ఫీజు వసూలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం 11గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం ఉంటుందని తెలిపారు. పాల్గొనే వారు లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం పొందని వారికి డిపాజిట్ వాపసు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

- గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి

ఇబ్రహీంపట్నం: నేటి విద్యార్థులే రేపటి భావితరాల శాస్త్రవేత్తలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి అన్నారు. వినోభానగర్ నల్లకంచె సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడురోజుల పాటు నిర్వహించిన జోనల్ లెవెల్ సైన్స్ ఫెయిర్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. నిత్య జీవితంలో కూడా సైన్స్ లాగే ప్రతి అంశాన్ని అన్వేషించినప్పుడే మనిషి నూతన ఆవిష్కరణలు చేపట్టగలడన్నారు. కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. గురుకుల విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో 65 పాఠశాలల నుంచి 260 మంది విద్యార్థులు 130 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. అత్యుత్తమంగా నిలిచిన వివిధ పాఠశాల ప్రదర్శనలకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఫెయిర్ల నిర్వహణతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయవచ్చన్నారు. విద్యార్థులు కేవలం సిలబస్‌లో ఉన్న పాఠ్యాంశాలే కాకుండా నూతన ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో గురుకులాల ఆర్‌సీఓ, హెచ్‌ఆర్‌ఆర్ (ఈస్ట్ జోన్) నాగలక్ష్మితో తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటించండి

- జిల్లాస్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశం



వికారాబాద్ అర్బన్: జిల్లాస్థాయి అధికారులందరూ వారానికి నాలుగు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కింది స్థాయి అధికారులు పనిచేసేలా చొరవ చూపాలన్నారు. ప్రతి శాఖలో సమయపాలన పాటించాలన్నారు. అటెండెన్స్ యాప్‌ను పక్కాగా అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చిగురిస్తున్న ఆశలు

- మన్నెగూడ – హైదరాబాద్ నాలుగు లేన్ల రహదారికి రెండేళ్ల క్రితం టెండర్లు పూర్తి
- పనులు ప్రారంభించడంలో మీనమేషాలు
- ఇరుకు రోడ్డులో తరచూ ప్రమాదాలు
- ఏడాదిలో 200వరకు నమోదవుతున్న మరణాలు
- జిల్లా వాసి సీఎం కావడంతో ప్రజల్లో ఆశలు



నాలుగు లేన్ల రహదారిగా విస్తరించాల్సిన మన్నెగూడ - అప్పా జంక్షన్ ఇదే..

వికారాబాద్: మన్నెగూడ నుంచి హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీ వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణంపై జిల్లా వాసులకు ఆశలు చిగురిస్తున్నాయి. ఇరుకు రోడ్డు కారణంగా జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల ప్రజలతో పాటు చేవెళ్ల వాసులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. అయితే జిల్లా వాసి.. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈ రోడ్డు విస్తరణకు ఇప్పటికే కేంద్రం నిధులు కేటాయించింది. టెండర్లు సైతం పిలిచింది. రోడ్డు నిర్మాణ పనుల బాధ్యత కేంద్రం చూస్తుండగా, భూ సేకరణ రాష్ట్ర ప్రభుత్వం చూడాల్సి ఉంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల విస్తరణ పనులు త్వరితగతిన పూర్తవున్నా మన్నెగూడ – హైదరాబాద్ నాలుగు లేన్ల రహదారి పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం జరిగింది. ఇరుకు రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో వాహనదారుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. దశాబ్ద కాలంగా ప్రజాప్రతినిధుల సూచనలతో అధికారులు రోడ్డు విస్తరణ పనుల కోసం ప్రతిపాదనలు పంపుతూ వచ్చారు. 2017లో హైదరాబాద్ – బీజాపూర్ అంతర్రాష్ట్ర రహదారి 163వ, జాతీయ రహదారిగా రూపాంతరం చెందింది. అయితే రద్దీ అంతంతగా ఉండే మన్నెగూడ నుంచి కర్ణాటక సరిహద్దులోని రావులపల్లి వరకు గల 72 కిలోమీటర్ల మూడు లేన్ల రహదారిని రూ. 250 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తి చేశారు. రద్దీ ఎక్కువగా ఉండే మన్నెగూడ – హైదరాబాద్‌లోని పోలీస్ అకాడమీ వరకు నిర్మించాల్సిన 46 కిలోమీటర్ల రహదారి పనుల్లో మాత్రం తీవ్ర జాప్యం చేస్తూ వస్తున్నారు.

తరచూ ప్రమాదాలు

కర్ణాటక, పరిగి, కొడంగల్ వైపు నుంచి వచ్చే వాహనాలు, వికారాబాద్, తాండూరు వైపు నుంచి వచ్చే వాహనాలు మన్నెగూడ వద్ద కలుస్తాయి. దీంతో మన్నెగూడ నుంచి హైదరాబాద్ వరకు వాహనాల రద్దీ భారీగా ఉంటుంది. దీనికి తోడు ఇటీవల హైదరాబాద్ నుంచి అనంతగిరికి పర్యాటకుల తాకిడి కూడా బాగా పెరిగింది. ఈ మార్గంలో మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసుల లెక్కల ప్రకారం సగటున ఏడాదికి ఈ మార్గంలో 200 మంది వరకు మృత్యువాత పడుతున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

ఏడాదిన్నర దాటినా..

2022 మార్చిలో మన్నెగూడ – హైదరాబాద్ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన టెండర్‌ను మేఘా సంస్థ దక్కించుకుంది. అయితే టెండర్ ప్రక్రియ పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. నిత్యం జిల్లా నలుమూలల నుంచి హైదరాబాద్‌కు వెళ్లి వచ్చే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. అయితే సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లు, షాపులను తొలగించాలంటూ ఆరు నెలలకు ఒక్కసారి నోటీసులు ఇవ్వడం ఆ తరువాత మిన్నకుండిపోవడం పరిపాటిగా మారింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈ పనులకు మోక్షం లభించే అవకాశం ఉందని జిల్లా వాసులు, అధికారులు సైతం భావిస్తున్నారు.

క్లుప్తంగా

స్పీకర్ ఎంపికపై హర్షం

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి



ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నరోత్తంరెడ్డి తదితరులు

మోమిన్‌పేట: మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా స్పీకరుగా ఎంపిక కానుండటంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నరోత్తంరెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ నిర్వహణకు ఆయనకు ఉన్న అనుభవం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లయ్య, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తుల స్వీకరణ



బంట్వారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎఓ సంధ్య

బంట్వారం: అర్హులైన రైతులు గడువులోపు రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి వ్యవసాయ అధికారులు సంధ్య, గీత తెలిపారు. బుధవారం బంట్వారం, బుగ్గాపూర్ రైతు వేదికలో అన్నదాతల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు వస్తే ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం జిరాక్స్ పత్రాలను రెండు రోజుల్లో అందజేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఎవరైనా ఉంటే సంబంధిత ఎఈఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఈఓలు మశ్చందర్, అయ్యప్ప, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయరూ?

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



అనంతగిరి ఘాట్ రోడ్డులో దెబ్బతిన్న రోడ్డు

అనంతగిరి: వికారాబాద్‌కు సమీపంలోని అనంతగిరి గుట్ట నుంచి కెరెల్లికి వెళ్లే మార్గంలోని ఘాట్ రోడ్డు పలు చోట్ల గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఘాట్‌లో వాహనాలు వేగంగా దిగడంతో ఒక్కసారిగా మధ్యలో రోడ్డు బాగులేకపోవడంతో చోదకులు అవస్థలు పడుతున్నారు. అదుపు తప్పితే మాత్రం ప్రమాదాలు జరగవచ్చు. ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

క్యాంపు కార్యాలయం ప్రారంభం

షాద్‌నగర్: షాద్‌నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయాన్ని బుధవారం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ ప్రారంభించారు. అనంతరం కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్రవిశాల, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి, రఘు, బాల్‌రాజ్, మురళీమోహన్ పాల్గొన్నారు.

సీఎంపైనే ఆశలన్నీ



మండలం నుంచి నిత్యం వేరే పట్టణాలకు వెళ్తున్న విద్యార్థులు

బొంరాస్‌పేట సమస్యలపై ఆరా

- నేడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష
- అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్

బొంరాస్‌పేట: నియోజకవర్గంలో రాజకీయంగా బొంరాస్‌పేట కేంద్ర బిందువుగా మారింది. అన్ని పార్టీల నేతలు తమ సేవలు, పదవులు చేపట్టేందుకు ముందుగా ఈ మండలాన్నే ఎంచుకోవడం ఆనవాయితీ. ఎప్పటి నుంచో సీఎం సీటుపై కలలుగన్నా రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌పై దృష్టి సారిస్తూ ప్రత్యేక సమీక్షకు సిద్ధమయ్యారని అధికార వర్గాలు చెబుతున్నాయి. అందుకు గురువారం నియోజకవర్గ కేంద్రంలో జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ అధ్యక్షత సమీక్ష నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ పదవులను పొందేందుకు బొంరాస్‌పేట మండలంలోనే తొలి అడుగు మోపారు. 2009లో జరిగిన ఎన్నికల్లో ప్రచారాన్ని వాస్తుపరంగా(ఈశాన్యం) మండలంలోని మదన్‌పల్లి నుంచి ప్రారంభించి విజయం సాధించారు. అప్పటి గెలుపు ఇప్పటి సీఎం పదవికి నాంది పలికిందని నమ్మారు.

వెతలు తీరుతాయనే ఆశతో

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్థానికుల్లో నూతనోత్తేజం రేకెత్తుతోంది. అలాగే తమ సమస్యలు త్వరితగతిన పూర్తి అవుతాయనే ధోరణిలో ప్రజలు ఉన్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో చిన్న బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేపచెట్టే మండల కేంద్రంలో ప్రజలకు నీడనిస్తోంది. ఉమ్మడి బొంరాస్‌పేట మండలంలో ప్రధానంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం గమనార్హం. మండలం నుంచి కొత్తగా ఏర్పడిన దుద్యాల మండలంలో జూనియర్ కళాశాల, పారామెడికల్ కళాశాల ఉండాలని ఆశిస్తున్నారు. గిరిజన తండాలు ఎక్కువగా ఉన్న మండలం కావడంతో ప్రధానంగా బాలిక విద్యా పదో తరగతికే ఫుల్‌స్టాప్ అయ్యాయని వాపోతున్నారు. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. రేగడిమైలారం ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచినా ఏకైక ఎస్‌ఏ పోస్టుతో కొనసాగుతోంది. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకై ఎదురుచూస్తున్నారు. బురాన్‌పూర్ గురుకుల పాఠశాలకు సొంత భవనంలేక వేరే ప్రాంతంలో నిర్వహణ జరుగుతోంది. పీహెచ్‌సీలో గర్భిణులు కాన్పులు చేయలేక దూరప్రాంతాలకు వెళ్తున్నారు. నాగిరెడ్డిపల్లి నుంచి కొత్తూరు, వడిచర్ల గ్రామాలకు బీటీరోడ్డు లేదు. అక్కడక్కడ ఉన్న బస్‌షెల్టర్లు శిథిలమయ్యాయి. మండలంలోని జాతీయ రహదారి పొడుగునా వ్యాపార పరిశ్రమలు నెలకొల్పాలని కోరుతున్నారు. అన్ని విధాల బాగుచేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి మండల ప్రజలు ఆశగా ఉన్నారు.

అన్ని విధాలా అభివృద్ధి



కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డికి మా మండలంపై ఎంతో అభిమానం ఉంది. ఆశించిన విధంగా ఉమ్మడి బొంరాస్‌పేట మండల ప్రజలు ఆశీర్వదించారు. మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి అభిమానాన్ని చాటుకుంటారు. త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తారు.

– నర్సింలుగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, బొంరాస్‌పేట

యువత సైన్యంలో చేరాలి



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

- దేశం కోసం సేవ చేసే వారే నిజమైన హీరోలు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి

పరిగి: దేశం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసే జవాన్లు నిజమైన హీరోలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి పేర్కొన్నారు. 2001 డిసెంబర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదులు పార్లమెంట్‌పై దాడి చేయడంతో అమరులైన జవాన్లకు బుధవారం పట్టణ కేంద్రంలో నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడ ఆపద ఉన్నా మేమున్నామంటూ ముందుకు వచ్చి దేశ ప్రజలను రక్షించే జవాన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. మన కోసం ప్రాణాలు త్యాగం చేసిన వీర జవాన్లను స్మరించుకోవాలని అన్నారు. వారు దేశ సరిహద్దుల్లో కాపల ఉండటం వల్లే మనం ఇక్కడ సంతోషంగా ఉన్నామన్నారు. దేశ సేవలో యువత పాల్గొని సైన్యంలో చేరాలన్నారు. కార్యక్రమంలో పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పరమేశ్వర్‌రెడ్డి, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

యాచారం: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన సురిగి రాములు మొదటి కుమారుడైన కల్యాణ్(21) మాల్‌లో బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అతడు వ్యక్తిగతంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. దీంతో బుధవారం మాల్‌లో ఉంటున్న అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు.

అధిక సాంద్రత పత్తితో లాభాలు

- ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్
- రైతులకు క్షేత్ర ప్రదర్శన



మేడిపల్లికలాన్‌లో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

పూడూరు: అధిక సాంద్రత కలిగిన పంటలు సాగు చేసి మంచి దిగుబడులు సాధించాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. కేంద్ర పత్తి పరిశోధన కేంద్రం ప్రత్యేక ప్రాజెక్టులో భాగంగా బుధవారం పూడూరు మండల పరిధిలోని మేడిపల్లికలాన్ గ్రామంలో రైతు విష్ణువర్దన్ రెడ్డి సాగు చేసిన పత్తి పంటను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తిలో కలుపుతీయడంతో పాటు, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులను వివరించారు. పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పత్తి పంట ఆవశ్యకతను, దిగుబడిని పెంచే విధానాన్ని రైతులకు తెలిపారు. పత్తిలో అంతర పంటల సాగుతో పాటు, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసి చీడపీడలను నివారించవచ్చని సూచించారు. సాధారణ పత్తి కంటే అధిక సాంద్రతతో పత్తి సాగు మంచి రాబడి ఇస్తుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు యమున , వెంకటేష్, మండల వ్యవసాయ అధికారుల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'మహా' సంతోషం!

- కిటికిటలాడుతున్న బస్సులు
- సిలిండర్ అప్‌డేట్ ప్రక్రియ మరూ

బొంరాస్‌పేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకి వచ్చి మహిళలకు 'మహా' సంతోషం నింపింది. ఉమ్మడి రాష్ట్రంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఇందిరమ్మ రాజ్యం కోసం తాపత్రయ పడ్డారు. తర్వాత ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని అమలుచేస్తూ మహిళల్లో సంబరాన్ని నింపారు. మిగిలిన హామీలు సైతం అమలయితే అతివల సంతోషానికి అవధులు లేకుండా పోతాయి.

నిండుతున్న బస్సులు

కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే మొదట మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా సీటిచ్చింది. మహాలక్ష్మి పథకం కింద అతివలకు ఉచిత ప్రయాణం ఈ నెల 9 నుంచి అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకుంది. దీంతో నిత్యం రాష్ట్ర మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో కిటికిటలాడుతోంది. ఆధార్ కార్డును చూపించి చిన్నా పెద్దా మహిళలంతా ఉచిత ప్రయాణంతో ఆనందంగా పొందుతున్నారు. కాగా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లకు వెళ్లాలంటే టికెట్టు తీసుకోవాలి. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చిన మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించడం లేదు. దీంతో కండక్టర్లు టికెట్ తీసుకొమ్మని కోరుతున్నారు. త్వరలో ఉచిత ప్రయాణం కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది.

బారులు తీరిన మహిళలు

మహాలక్ష్మి పథకంలోని రూ.500 గ్యాస్ సిలిండర్ అమలు చేసేందుకు అప్‌డేట్ ప్రక్రియ మొదలైంది. బొంరాస్‌పేట ఏజెన్సీ, ఆధార్ కేంద్రాల వద్ద మహిళలు రోజంతా బారులు తీరారు. కుప్పలు తెప్పలుగా రావడంతో రోజంతా వేచి చూసినా రాత్రి వరకు పని పూర్తి కాలేక ఇళ్లకు చేరుకున్నారు. ఇప్పటికే ఉచిత ప్రయాణం, తక్కువకే గ్యాస్ సిలిండర్ ఉల్లాసంలో ఉండగా ఇక ప్రతినెల రూ.2,500 నగదు చేతికందితే ఏమేరకు మహిళాలోకం సంబరపడి పోతుందో చూడాలి. మరోవైపు ప్రభుత్వం గందరగోళమవుతుందోనని మేధావులు, రాజకీయవేత్తలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



టికెట్ తీసుకున్న మహారాష్ట్ర మహిళ

విద్యార్థుల ప్రగతిపై సమీక్ష

- ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల వివరణ
- జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



విద్యార్థిని ప్రశ్నలు అడిగి బోర్డుపై సమాధానాలు రాయిస్తున్న డీఈఓ రేణుకాదేవి

ధారూరు: మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బుధవారం 'ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ' కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రగతిపై జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సమీక్షించారు. అన్ని తరగతుల విద్యార్థులను భౌతికశాస్త్రం, గణితం తదితర సబ్జెక్టులపై పలు ప్రశ్నలు అడిగి బోర్డుపై రాయించారు. ఈ సందర్భంగా ఆమె ఉపాధ్యాయులతో చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను గ్రూపుల వారీగా విభజించి గణితం, భౌతిక శాస్త్రంపై ప్రత్యేక తరగతులు తీసుకోవాలన్నారు. కాలానుగుణంగా పాఠ్యాంశాల బోధన చేసి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా శ్రమించాలన్నారు. మల్టీ గ్రేడింగ్ టీచింగ్ ఏ విధంగా చేయాలో సూచించారు. బహుళ తరగతి బోధనలపై మెళకువలు ఇచ్చారు. అంతకు ముందు డీఆర్‌పీ నర్సింహారావు ఎఫ్‌ఎల్‌ఎన్ అమలు తీరును వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబుసింగ్, నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు తీర్చండి

ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్‌ను సన్మానించిన ఉపాధ్యాయులు

వికారాబాద్ అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో సంతోషంగా ఉన్నారని, తమ సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కడిగాయల చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు బాబ్యా నాయక్ తదితరులు ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్‌ను కోరారు. బుధవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ప్రసాద్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా ఉపాధ్యాయ బదిలీలు చేపట్టడంతో పాటు, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. సంఘం నాయకులు అమర్నాథ్, రాజశేఖర్, రమేష్ సింద్, కృష్ణారెడ్డి, రాఘవేందర్, అశోక్, నర్సింలు, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అధైర్య పడొద్దు



ధారూరు: పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: ఎన్నికల్లో ఓటమి పాలైన నిరుత్సాహపడేది లేదని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ధారూరు మండల పరిధిలోని ఎబ్బనూర్, అల్లిపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడవద్దని, ప్రజా తీర్పును గౌరవిస్తూ ఉంటానని అన్నారు. ప్రజా శ్రేయస్సుకు నిర్విరామంగా కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ కోలుకోవాలని..

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలనీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆకాంక్షించారు. మండల పరిధిలోని ఎబ్బనూర్ గ్రామ హనుమాన్ దేవాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అభిషేకం చేసి ప్రత్యేక పూజ నిర్వహించారు.

అసెంబ్లీ ఫలితాలతో నిరాశ చెందొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌ముదిరాజ్

- పంచాయతీ ఎన్నికలలో సత్తా చాటుదాం
- బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు నిరాశ చెందవద్దని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో బీఎస్పీ ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలలో గ్రామస్థాయిలో వార్డు సభ్యులు, సర్పంచ్‌ల గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు. మరో ఐదేళ్లలో బీఎస్పీని గ్రామస్థాయి నుంచి పటిష్ట పర్చేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ప్రభుకుమార్, నియోజకవర్గ ఇంచార్జ్ సత్యమూర్తి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అంజద్‌అలీ, నాయకులు అరుణ్‌రాజ్, నవీన్‌కుమార్ తదితరులున్నారు.

ట్రాక్టర్‌లో దగ్ధం



ట్రాక్టర్ ట్రాలీపై దగ్ధమవుతున్న గడ్డి

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకున్న ఘటన మరికల్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన అంతంపల్లిలో గ్రామానికి చెందిన బండ మహేశ్ పశువుల మేత(పశుగ్రాసం) నిమిత్తం ట్రాక్టర్‌పై గడ్డిని తీసుకు వస్తున్న క్రమంలో విద్యుత్తు వైర్లు తగిలి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ట్రాక్టరు డ్రైవర్ ఇంజన్‌ను వేరు చేసి ట్రాలీని దూరంగా తీసుకెళ్లాడు. మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ గడ్డి పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ ఘటనలో సూమారుగా రూ.20వేలు నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదనకు గురైయ్యాడు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు

కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి



లింగంపల్లి చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

బంట్వారం: మద్యం తాగి వాహనాలు నడుపరాదని కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి సూచించారు. బుధవారం కోట్‌పల్లి మండల పరిధిలోని లింగంపల్లి చౌరస్తాలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ స్రవంతి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింతగా ముమ్మరం చేస్తారన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసే ముందు ఒక్క క్షణం తమ కుటుంబాలను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. వాహనదారులు సురక్షితంగా ప్రయాణించాలనేదే పోలీసుల ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతి ఒక్కరు చట్టానికి కట్టుబడి పోలీసులకు సహకరించాలని ఆమె సూచించారు.

అయోధ్య టు శ్రీలంక

మాజీ సైనికుల సైకిల్‌యాత్రకు పెద్దఅంబర్‌పేటలో ఘన స్వాగతం



పెద్దఅంబర్‌పేటలో సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ఏసీపీ భీంరెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన శివనారాయణ మిశ్ర, ఉల్లాస్ కులకర్ణి, డాక్టర్ సాయబావ్ కాసోట్ సైన్యంలో కలిసి పనిచేసిన వీరు ముగ్గురు మిత్రులు. కాగా వీరు ముగ్గురు కలిసి ఆధ్యాత్మిక యాత్ర చేపట్టాలని భావించారు. ఈ క్రమంలో ఇటీవల శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి శ్రీలంకలో రావణాసురుడిని వధించిన ప్రాంతానికి సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. సుమారు 5,600 కిలో మీటర్ల మేర కొనసాగనున్న ఈ మాజీ సైనికుల యాత్ర మార్గమధ్యలో బుధవారం పెద్దఅంబర్‌పేటలోని ఔటర్ రింగ్ రోడ్డు కూడలికి చేరుకుంది. దీంతో తెలంగాణ రాష్ట్ర మాజీ సైనికుల సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య చైర్మన్ పరెడ్డి మనోహర్‌రెడ్డి, రాజఫణి రవీంద్రాచారి, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్, శివ నారాయణకృష్ణ.. ఈ బృందానికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆరు పదులు దాటిన ఆ ముగ్గురు మాజీ సైనికులు..సైకిల్ తొక్కడం ద్వారా శారీరకంగా, సామాజికపరంగా కలిగే ప్రయోజనాలను యాత్రలో భాగంగా ప్రజలకు వివరిస్తున్నారు. సైకిల్‌తో ప్రయాణం చేస్తూ ఇందన పొదుపు, కాలుష్య నివారణ, ఆరోగ్యం, వ్యాయామం వంటి ప్రయోజనాలు ఉన్నాయంటూ ప్రజలకు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జగ్గీవన్‌చారి, సాలువాచారి, రాజమునిచారి, గంటా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

మహేశ్వరం: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెనిమెళ్ల గ్రామానికి చెందిన గడ్డిపోగుల బాలరాజ్(29) పదేళ్ల క్రితం బాలాపూర్‌కు వచ్చి ఆర్సీఐ సర్వెంట్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 7న ఆయన సొంతూరుకు వెళ్లాడు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి



మంత్రి సీతక్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు

కడ్తాల్: రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)ను తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గడిచిన ఐదేళ్లలో గ్రామాలలో సర్పంచ్‌లు చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేశారు. ఈ మేరకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు, సమస్యలను పరిశీలించి, పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సర్పంచ్‌లు పనిచేయాలని మంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు భూమన్నయాదవ్, మహిళా అధ్యక్షురాలు ధనలక్ష్మి, సభ్యులు వెంకటేశ్, రామేశ్వర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.